

జడ్పీ ఉన్నత పాఠశాల(బాలుర)లో డిజిటల్ పాఠాలను బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

# చూద్దాం.. విందాం.. నేర్చుకుందాం

- సర్కారు బడుల్లో డిజిటల్ బోధన
- గత బీఆర్ఎస్ సర్కారు హయాంలోనే పాఠశాలల ఆధునీకరణ
- మన ఊరు మన బడి కింద డిజిటల్ తరగతుల ఏర్పాటు
- హుజూరాబాద్ మండలంలో ఈ విద్యాసంవత్సరం నుంచి క్లాసుల ప్రారంభం
- ప్రత్యక్ష బోధనతో విద్యార్థుల్లో పెరుగుతున్న ఆసక్తి
- పాఠశాలల్లో మెరుగుపడుతున్న ఫలితాలు

సర్కారు బడి సరికొత్తగా మారింది. సకల సౌకర్యాలు, ఆధునిక హంగులతో రూపుదిద్దుకున్నది. పాఠశాల విద్య బలోపేతమే లక్ష్యంగా పనిచేసిన గత రాష్ట్ర సర్కారు, 'మన ఊరు– మన బడి' కింద మరింత అభివృద్ధి చేసింది. స్కూళ్ల అవసరాలేంటి..? ఏమేమి పనులు చేయాలి..? అనే పూర్తి వివరాలు తెలుసుకొని ఆధునీకరించింది. ముఖ్యంగా విద్యార్థులు క్లాస్ రూంలో ఎక్కడి నుంచైనా చూసేలా 75 ఇంచుల వెడల్పు స్క్రీన్స్‌తో డిజిటల్ తరగతులను ఏర్పాటు చేయగా, హుజూరాబాద్ నియోజకవర్గంలో జడ్పీహెచ్ఎస్ స్కూల్లో ఈ విద్యాసంవత్సరం నుంచి బోధన ప్రారంభమైంది. ఎంతో అర్థవంతంగా తరగతులు నడుస్తుండగా, ప్రత్యక్ష బోధనతో పిల్లల్లో ఆసక్తి పెరుగుతున్నది.

**- హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్14**

స్వరాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మారుతున్నాయి. గత ప్రభుత్వం సర్కార్ బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే గాక ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. సర్కారు బడుల బలోపేతానికి మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డిజిటల్ తరగతులు బోధించేందుకు శ్రీకారం చుట్టింది. పాఠశాలల్లో డిజిటల్ విద్యలో భాగంగా హుజూరాబాద్ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు బోర్నపల్లి జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల, కందుగుల, చెల్పూర్, రాంపూర్‌లోని జడ్పీహెచ్ఎస్‌లలో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం డిజిటల్ తరగతులు ప్రారంభించింది. ఆయా పాఠశాలల్లో 8,9,10వ తరగతుల వారికి డిజిటల్ విద్యను బోధిస్తున్నారు. విద్యార్థులు తరగతి గదిలో ఎక్కడి నుంచైనా చూసేలా 75 ఇంచుల వెడల్పుతో టీవీలను ఏర్పాటు చేశారు. ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ)లను టీవీల ద్వారా సాధారణ బోధన, కంప్యూటర్ ఉపయోగించి, ఉపాధ్యాయులు చేతి వేళ్లతో నచ్చిన రంగులతో అక్షరాలు రాసే విధంగా ఏర్పాటు చేశారు. మండలంలో ప్రతి పాఠశాలలో మూడు తరగతులకు మూడు ఐఎఫ్‌పీలను ప్రభుత్వం పంపిణీ చేసింది. గతంలో చెప్పిన పాఠాలను రికార్డు చేసి పాఠాలను వినేలా ఏర్పాటు చేశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు డిజిటల్ విద్య బాగా ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. చిత్రాలు, వీడియో, పాటల ద్వారా బోధించడం వల్ల వారికి ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యుత్ సరఫరా లేకపోయినా డిజిటల్ విద్యను కొన్ని గంటల పాటు బోధించవచ్చని ఉపాధ్యాయులు తెలిపారు.



### ప్రత్యక్ష బోధనతో ఆసక్తి పెరుగుతుంది

డిజిటల్ బోధనతో విద్యార్థులకు తొందరగా అర్థమవుతుంది. పాఠ్యాంశాలను ప్రత్యక్షంగా చూపిస్తూ బోధిస్తుండడంతో విద్యార్థులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా డిజిటల్ బోధన ఉపయోగకరంగా ఉంటుంది. చాక్ పీస్, డస్టర్లు లేకుండానే పాఠాలు బోధిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులకు ఎంతో ఉపయోగం.

**- జీ సమ్మిరెడ్డి, హెచ్‌ఎం, జడ్పీహెచ్‌ఎస్, హుజూరాబాద్**

### సులువుగా నేర్చుకోగలుతున్నాం



డిజిటల్ విద్యలో భాగంగా దృశ్య బోధనతో సులువుగా నేర్చుకోగలుగుతున్నాం. పాఠ్యాంశాలు త్వరగా అర్థమవుతున్నాయి. పాఠ్యాంశాలను వీడియో రూపంలో వినడం, చూడడం ఆసక్తిగా అనిపిస్తుంది. చరిత్రకారులు, రాజకీయ నేతలు, మానవుని జీర్ణక్రియ వ్యవస్థ, గుండె, పొలాలు, రాకెట్, విమానం, మాకు తెలియని జంతువులు, వస్తువులు తదితర వాటిని వీడియో రూపంలో చూసి ఇలా ఉంటాయి..? అని అర్థం చేసుకుంటున్నాం. డిజిటల్ బోధన విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. దీన్ని అందించిన కేసీఆర్ ప్రభుత్వానికి ధన్యవాదాలు.

**- ఇందుశ్రీ, పదో తరగతి, విద్యార్థి**

### ఆసక్తి పెరుగుతున్నది



డిజిటల్ పద్ధతిలో పాఠ్యాంశాలను బోధించడం వల్ల చదువుపై మరింత ఆసక్తి పెరుగుతున్నది. ప్రతి అంశాన్ని సులువుగా అర్థం చేసుకోగలుగుతున్నాం. సైన్స్ పాఠమంటే ఇంతకు ముందు భయంగా ఉండేది. ప్రాజెక్టర్ ద్వారా వివరించడంవల్ల భయం పూర్తిగా పోయింది. ఇంతకు ముందు పాఠాలు వినాలంటే ఆసక్తి ఉండేది కాదు. డిజిటల్ తరగతుల వల్ల ఆసక్తి పెరిగింది. ఉపాధ్యాయులు పాఠాలు చెప్పినప్పుడు కొన్ని అంశాలను గుర్తుంచుకోలేకపోతున్నాం. తిరిగి వాటిని ప్రాజెక్టర్ ద్వారా చూపించడం వల్ల అన్ని అంశాలు గుర్తుంటున్నాయి. ముఖ్యమైన అంశాలు మరింతగా వివరంగా తెలుసుకోగలుగుతున్నాం.

**- అభినవశ్రీ, 8వ తరగతి**

# జీఎస్టీ చెల్లింపునకు ఎసరు ?

## జగిత్యాల కేంద్రంగా భారీ దందా






- పన్ను ఎగవేసేందుకు అడ్డదారులు
- ఓ ఆడిటర్ వద్ద పనిచేసిన అసిస్టెంట్ కీలకపాత్ర
- పాత ఫర్మ్‌ల పేరిట బోగస్ టాక్స్ ఇన్‌వాయిస్‌లు సృష్టించి ఎగనామం
- వీటి విలువ దాదాపు ₹200 కోట్ల వరకు ఉంటుందని అంచనా
- ఈ చైన్ లింకు ఉమ్మడి జిల్లాలో సాగిందనే అనుమానాలు
- కలకలం రేపుతున్న బాగోతం
- రంగంలోకి అధికారులు
- అక్రమార్కుల్లో వణుకు
- విచారణ చేస్తున్నాం : జీఎస్టీ ఇన్‌చార్జి జాయింట్ కమిషనర్ రవికుమార్

కరీంనగర్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : దేశ వ్యాప్తంగా వస్తువుల తయారీ, అమ్మకం (అవుట్‌పుట్, ఇన్‌పుట్) వంటి వాటిపై వినియోగించేదే వస్తు సేవల పన్ను (గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్– జీఎస్టీ). ట్రేడర్స్, రిటైలర్స్, కాంట్రాక్టర్స్ ఇలా విభిన్న వర్గాలు జీఎస్టీ రూపంలో కేంద్రానికి, రాష్ట్రానికి పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. జీఎస్టీ పలు రకాలుగా ఉన్నది. ఒక వస్తువుపై 24 శాతం జీఎస్టీ ఉంటే.. మరొకదానిపై 5 శాతం ఉన్నది. ఇలా అనేక స్లాబ్‌లు ఉన్నాయి. నిబంధనలకు లోబడి సంబంధిత వ్యాపార వర్గాలు జీఎస్టీ చెల్లించాలి. అందుకోసం ముందుగా ఒక ఫర్మ్ ఓపెన్ చేసుకొని, సదరు ఫర్మ్‌పై చేసే క్రయవిక్రయాలకు అనుగుణంగా చెల్లింపులు చేయాలి. అయితే ప్రభుత్వానికి రూ.లక్షల్లో జీఎస్టీ ఎందుకు చెల్లించాలన్న దురుద్దేశంతో జగిత్యాల కేంద్రంలో కొంత మంది వ్యాపారులు, కాంట్రాక్టర్లు, విభిన్న వర్గాలు అడ్డదారులు తొక్కి, టాక్సు ఇన్‌వాయిస్‌లు సృష్టించి దందా నడిపినట్టు తెలుస్తున్నది. వాటి ద్వారా జీఎస్టీ చెల్లింపులు చేయకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టగా, దీని విలువ దాదాపు రూ.200 కోట్ల పై మాటే ఉంటుందని విశ్వసనీయ వర్గాల సమాచారం ద్వారా తెలుస్తున్నది.

### జగిత్యాల కేంద్రంగా..

జగిత్యాలకు చెందిన ఓ ఆడిటర్ వద్ద గతంలో అసిస్టెంట్‌గా పనిచేసిన ఒక వ్యక్తి ఈ దందాలో కీలక భూమిక పోషించాడు. ఆయనతోపాటు మరికొంత మంది కలిసి ఈ దందా నడిపినట్టు తెలుస్తున్నది. సదరు అసిస్టెంట్ ఆ ఆడిటర్ దగ్గరి నుంచి వెళ్లిపోయే సమయంలో క్లోజింగ్ చేయాలని ఇచ్చిన ఫర్మ్‌ల డాటా తీసుకెళ్లి.. సదరు ఫర్మ్‌ల పేరిట ఈ దందా సాగించినట్టు తెలుస్తున్నది. జగిత్యాలలోని ఒక ఎలక్ట్రికల్ ట్రేడర్‌కు సంబంధించి ఆయనకు తెలియకుండానే.. అతని పాత ఫర్మ్ పేరిట బోగస్ టాక్స్ ఇన్‌వాయిలు సృష్టించిన వ్యవహారంతో ఈ బాగోతం బయటపడినట్టుగా సమాచారం. సదరు ట్రేడర్ పేరిట భారీ మొత్తంలో టాక్స్ ఇన్‌వాయిస్‌లు వచ్చిన విషయాన్ని గుర్తించిన జీఎస్టీ అధికారులు, వాటిని ఆధారంగా చేసుకొని చెల్లించాల్సిన జీఎస్టీపై సదరు ట్రేడర్ వద్దకు వెళ్లి ప్రశ్నిస్తే.. అతను చెప్పిన విషయాలు విని అధికారులే విస్మయానికి గురైనట్లుగా సమాచారం. తన పాత ఫర్మ్‌ను గతంలోనే క్లోజ్ చేయాలని ఆడిటర్‌కు చెప్పానని, సదరు ఫర్మ్ పేరిట ఎటువంటి క్రయవిక్రయాలు చేయలేదని, ఇదంతా తనకు తెలియకుండానే జరిగిందని, ఇవన్నీ బోగస్ టాక్స్ ఇన్‌వాయిస్‌లే అని చెప్పడంతో అధికారులు నిర్ఘాంత పోయినట్టు సమాచారం.

### ఉమ్మడి జిల్లాకు లింకులు

జీఎస్టీ బాగోతంలో లోతుగా విచారణ చేస్తే.. తీగలాగితే డొంక కదులుతున్నట్టుగా సమాచారం. భారీ మొత్తంలో బోగస్ టాక్స్ ఇన్‌వాయిస్‌లు సృష్టించి చాలా మంది జీఎస్టీ ఎగవేతకు పాల్పడిన విషయం బహిర్గతం అయినట్లుగా తెలుస్తున్నది. ఇది కేవలం ఒక్క జగిత్యాల జిల్లాకు మాత్రమే పరిమితం కాలేదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ బాగోతం ఉమ్మడి జిల్లాలో ఒక చైన్ లింకులా నడిచిందన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. బోగస్ ఇన్‌వాయిస్‌లు సృష్టించిన వ్యక్తులు.. సదరు ట్రేడర్స్, కాంట్రాక్టర్ల నుంచి భారీ మొత్తమే వసూలు చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ దందా బహిర్గతం కావడంతో సదరు అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. మరోవైపు ఈ వ్యవహారంలో ఏ అధికారి పాత్రైనా ఉన్నదా..? వారి పాత్ర లేకుండా ఇంత పెద్ద మొత్తంలో బోగస్ వాయిస్‌లు సృష్టించి జీఎస్టీ ఎగవేతకు ప్రయత్నించడం సాధ్యమేనా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### తీగలాగుతున్న అధికారులు


సహజంగా జీఎస్టీ చెల్లింపుల్లో ఒడిదొడుకులున్నప్పుడు ఆయా ట్రేడర్స్‌కు సంబంధించి ఆడిటర్స్ ఇచ్చిన వివరాలను పరిశీలించి జీఎస్టీ అధికారులు అందుకు అనుగుణమైన చర్యలు తీసుకుంటారు. ఆడిటర్స్ ఇచ్చిన వివరాల్లో ఏమైనా లోటు పాట్లు ఉంటే.. ఆ విషయాన్ని వివరిస్తూ.. ట్రేడర్స్ చెల్లించాల్సిన జీఎస్టీ ఏమైనా ఉంటే నోటీసులు ఇచ్చి పేమెంట్ చేయిస్తారు. ఇది రొటీన్‌గా జరిగే పద్ధతి. కానీ, జగిత్యాలలో వెలుగు చూసిన వ్యవహారం దీనికి పూర్తి విరుద్ధం. ఎటువంటి క్రయ విక్రయాలు లేకుండా.. పలు ఫర్మ్‌ల పేరిట బోగస్ టాక్స్ ఇన్‌వాయిస్‌లు సృష్టించి.. పెద్ద మొత్తంలో జీఎస్టీ చెల్లింపునకు ఎగనామం పెట్టేందుకు ప్రయత్నాలు జరిగాయి. దీనిని సీరియస్ తీసున్న జీఎస్టీ అధికారులు.. గడిచిన రెండు రోజులుగా విచారణ చేస్తున్నట్లుగా తెలుస్తున్నది. ఇప్పటికే పలు ఆధారాలు సేకరించి, మరింత లోతుగా విచారణ చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను రంగంలోకి దింపిన అధికారులు.. పూర్తి వివరాలు లాగుతున్నారని తెలుస్తున్నది.

### విచారణ చేస్తున్నాం

బోగస్ టాక్సు ఇన్‌వాయిస్ అంశంపై 'నమస్తే తెలంగాణ' ఇన్‌చార్జి.. జేసీకి ఫోన్ చేసి వివరణ కోరగా, ఈ వ్యవహారంపై విచారణ చేస్తున్నామని చెప్పారు. తమ పరిశీలనలో భాగంగా కొన్ని విషయాలను గుర్తించామన్నారు. ఇంకా పూర్తి విరాలు తేలలేదని, ఇంకా కొంత సమయం పడుతుందని చెప్పారు. కాగా, ఇదంతా రొటీన్‌గా జరిగే తనిఖీల్లో భాగంగానే తమ విచారణ సాగుతుందని తెలిపారు. విచారణ పూర్తయ్యాక వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

**- సీహెచ్ రవికుమార్, కరీంనగర్ జీఎస్టీ ఇన్‌చార్జి జాయింట్ కమిషనర్**



జగిత్యాలలో వివరాలు వెల్లడిస్తున్న వాణిజ్య పన్నుల శాఖ హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్లు

## ఫేక్ జీఎస్టీ ఖాతాల్లో రూ.కోట్ల లావాదేవీలు

- వాణిజ్య పన్నుల శాఖ అధికారుల అదుపులో జగిత్యాల వ్యక్తి
- 30కి పైగా ఖాతాలను గుర్తింపు
- పూర్తి విచారణ తర్వాతే లావాదేవీల వివరాలు

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 14 : ఫేక్ జీఎస్టీ ఖాతాల ద్వారా రూ.కోట్ల లావాదేవీలు జరిపారని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు జగిత్యాలకు చెందిన ఓ వ్యక్తిని గురువారం అదుపులోకి తీసుకున్నారు. వాణిజ్య పన్నుల శాఖ హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్లు వేణుగోపాల్, బాలాజీ జగిత్యాల వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో మాట్లాడారు. జగిత్యాల పట్టణానికి చెందిన చంద సాయి హైదరాబాద్‌లోని ఓ ట్యాక్స్ కన్సల్టెంట్ వద్ద పనిచేస్తున్నాడని, రద్దయిన వివిధ రకాల సొసైటీల పేరు మీద ఫోన్ నంబర్లు, మెయిల్ ఐడీలు మార్చి కోట్ల రూపాయల లావాదేవీలు జరిపి జీఎస్టీ క్లెయిమ్ చేశారని, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం జగిత్యాలలో సాయి ఇంట్లో సోదాలు చేశామని తెలిపారు. ప్రాథమికంగా 30 ఫేక్ ఖాతాల్లో లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని, పూర్తి స్థాయిలో విచారిస్తే కాని గోల్‌మాల్ జరిగిన మొత్తం విలువ తెలుస్తుందని, విచారణ పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.



చీపురు పుల్లలను సేకరిస్తున్న మహిళలు



కుప్పగా పోసిన చీపురు పుల్లలు

# చీపురు పుల్లల వేట బతుకు బాట

- సింగరేణి మిగులు భూముల్లో సేకరిస్తున్న గిరి మహిళలు
- అటవీ ఉత్పత్తులను ఆదాయవనరుగా మలుచుకుంటున్న గృహిణులు

సింగరేణిలో సహజసిద్ధంగా లభిస్తున్న బొగ్గు ద్వారా కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నది. అదేసంస్థ మిగులు భూముల్లోని సహజ సిద్ధమైన మొక్కల నడుమ పెరుగుతున్న చీపురు పుల్లల మొక్కలే నిరుపేద గిరిజనులకు ఆదాయ వనరులుగా మారుతున్నాయి. సింగరేణి పర్యావరణ పరిరక్షణలో భాగంగా మైనింగ్ పరిసర ప్రాంతాల్లో వందలాది ఎకరాలను అటవీ ప్రాంతాలుగా మారుస్తున్నది. ఆ ప్రాంతంలో దొరికే చీపురు పుల్లల సేకరణనే ప్రధాన వృత్తిగా జిల్లా రామగిరి మండలం యైటింక్లయిన్‌కాలనీలోని లంబాడీ తండాకు చెందిన పలువురు గిరిజన మహిళలు ఉపాధి పొందుతున్నారు. కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండాలనే సంకల్పంతో కష్టాన్నే నమ్ముకున్న ఆ మహిళలంతా ప్రతి రోజు చీపురు పుల్లలను సేకరిస్తూ స్వయం ఉపాధి పొందుతున్న వైనంపై ప్రత్యేక కథనం.

*- పెద్దపల్లి, డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ)*

పెద్దపల్లి జిల్లా రామగిరి మండం వకీల్‌పల్లె పూర్తిగా సింగరేణి ఓసీపీ–3 విస్తరణతో భూములు, ఇండ్లు కోల్పోయి నిర్వాసిత గ్రామంగా మారింది. దీంతో చుట్టూరా వందలాది ఎకరాలు బీడు భూములుగా మారాయి. ఈ స్థలాల్లో సింగరేణి గ్రీనరీ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా పెద్ద ఎత్తున మొక్కల పెంపకాన్ని చేపట్టింది. 15 ఏళ్లుగా అటవీ సంపద పెరిగి పూర్తి అభయారణ్యాలుగా మారిపోయాయి. ఈ నేపథ్యంలోనే చెట్ల మధ్యలో అటవీ పండ్లు, ఫలాలకు తోడు చీపురు పుల్లల మొక్కలు సైతం పెద్ద ఎత్తున విస్తరిస్తున్నాయి. కాల క్రమేణా చీపురు పుల్లల చెట్లు అంతరించి పోతుండగా వాటి స్థానంలో ప్లాస్టిక్ చీపుర్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో పూర్వకాలం నుంచి వినియోగంలో ఉన్న చీపురు కట్టలకు మార్కెట్‌లో భలే డిమాండ్ కనిపిస్తున్నది. అటవీ గ్రామాలకే పరిమితమైన ఈ చీపురు కట్టలు సింగరేణి ప్రభావిత గ్రామాల్లో సైతం అందుబాటులోకి రావడంతో స్థానికంగా ఉన్న గిరిజన మహిళలు వీటిని సేకరిస్తూ, విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు.

### రూ.40 పలుకుతున్న చీపురు కట్ట

అడవిలో పెరిగి ప్రతీ ఇంటికీ పురాతన కాలం నుంచి శుభ్రం చేసే చీపురుకట్టను ప్రతీ ఇంటి ఇల్లాలు పవిత్రంగా చూసుకుంటుంది. చీపురు కట్ట లేని ఇల్లు అంటూ ఉండదు. గతంలో అడవులు ఎక్కువగా ఉండడంతో గ్రామీణులు చీపురు కట్టలను తయారు చేసి పల్లెల్లో విరివిగా విక్రయించే వారు. అయితే, కాలక్రమేణా అడవులు అంతరించి పోతుండడం, సేకరించే వారు సైతం తక్కువ కావడంతో రూ.6–7ధర పలికిన అడవి చీపురు కట్టలు నేడు రూ.40 వరకు ధర పలుకుతుంది. దీంతో చీపురు పుల్లలు అందుబాటులో ఉన్న పలు గ్రామాల మహిళలు వాటిని సేకరిస్తూ ఉపాధి పొందుతున్నారు.

### గ్రూపులుగా ఏర్పడి సేకరణ

సింగరేణికి చెందిన వందల ఎకరాల్లో పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా అధికారులు పెద్ద సంఖ్యలో చెట్లను పెంచుతుంటారు. ఓబీ కుప్పలతో పాటు గుంపులు గుంపులుగా ఉండే చెట్లను సింగరేణికి సంబంధించిన ఈ స్థలాలు చెట్లతో అడవిని తలపించే మారాయి. మహిళలు 5 నుంచి 10 మందితో గ్రూపుగా ఏర్పడి పని కష్టాన్ని మరిచి పోయే విధంగా పాటలు.. మాటలతో కాలక్షేపం చేస్తూ.. చీపురు పుల్లలను సేకరిస్తున్నారు. ఇలా సింగరేణి మిగులు భూముల్లో పుల్లల సేకరణకు, అటవీ ఉత్పత్తుల సేకరణకు అనుమతులు ఇచ్చి తమ ఉపాధికి సింగరేణి తోడ్పాటునందించాలని కోరుతున్నారు.

### పుల్లల సేకరణ చాలా కష్టం..



చీపురు పుల్లల సేకరణ చాలా కష్టంతో కూడిన పని. సింగరేణికి సంబంధించిన ఈ స్థలాల్లో పెద్ద పెద్ద చెట్లు ఉంటాయి. ఈ చెట్లతో పాటు సహజంగా పెరిగే చీపురు పుల్లలను ఏరుకొని మేం జీవనోపాధి పొందుతున్నాం. దట్టమైన చెట్లతో ఉండే ప్రదేశంలో పురుగు బుషి బాధ ఎక్కువగానే ఉంటుంది. వాటిని కనిపెట్టకుంటూ చాలా జాగ్రత్తగా పని చేసుకోవాలి. చీపురు పుల్లలు సేకరించే సమయంలో ఆ చెట్టుకు ఉండే ముల్లులు శరీరానికి గుచ్చుతూ గాయం చేస్తాయి. ఎంతో కష్టాన్ని తట్టుకుంటే కానీ ఈ చీపురు పుల్లలను సేకరించలేం.

**-రాజమల్లమ్మ, గృహిణి, లంబాడీతండా, యైటింక్లయిన్‌కాలనీ**

### కుటుంబానికి ఆసరా అవుతున్నది..



చీపురు పుల్లల సేకరణ మా కుటుంబానికి కొంత మేర ఆర్థిక అవసరాలకు అండగా ఉంటుంది. మా తండాకు చెందిన కొంత మందిమి సింగరేణి ఖాళీ స్థలంలో సాధారణంగా పెరిగే ఈ చీపురు పుల్లలను సేకరించుకుంటున్నాం. వీటిని ఇంటికి తీసుకెళ్లి ఎండబెట్టిన తరువాత చీపురు కట్టలుగా తయారు చేస్తాం. కుటుంబ అవసరాలకు ఉంచుకోవడంతో పాటు అవసరమైన వారికి అందజేసి ఆర్థికంగా కొంత మేర నిలదొక్కుకుంటున్నాం.

**- రాజమ్మ, గృహిణి, లంబాడీ తండా, యైటింక్లయిన్ కాలనీ**

### సర్కారే దారి చూపాలి..



పేద కుటుంబాలకు చెందిన తామంతా పొట్టకూటి కోసం ఇలా చీపురు పుల్లలను పోగుచేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాం. ముల్లులు కుచ్చుతున్నా కూడా పట్టించుకోకుండా కష్టాన్ని భరిస్తూ ఇలా చీపురు పుల్లలను సేకరిస్తున్నాం. వాటిని కట్టలుగా మార్చి విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాం. సింగరేణి ప్రభావిత ప్రాంతాలకు చెందిన తమకు ప్రభుత్వం లేదా సింగరేణి సంస్థ జీవనోపాధి కోసం మాకు ఏదైనా దారి చూపించి ఆదుకోవాలి.

**- లక్ష్మి, గృహిణి, లంబాడీతండా, యైటింక్లయిన్ కాలనీ**

### తయారీకి వారం పడుతుంది



సింగరేణికి సంబంధించి ఖాళీ భూముల్లో సహజంగానే ఈ చీపురు పుల్లల మొక్కలు పెరుగుతాయి. వీటిని కొడవళ్లతో కోసి ఇంటికి తీసుకెళ్తాం. ఎండ బెట్టి, కట్టలుగా మార్చుకొని విక్రయిస్తున్నాం. ఇలా ఒక్క కట్ట పుల్లలను చీపురుగా తయారు చేయాలంటే వారం రోజుల పాటు ఎండాలి. అప్పుడే కట్టలుగా కట్టే అవకాశం ఉంటుంది. **-తారమ్మ, గృహిణి, లంబాడీ తండా, యైటింక్లయిన్‌కాలనీ**